క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే వేంకటేశ్వర స్వామికి సుప్రబాత సేవ, ఆరాధన, బాలభోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం జరిపించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

విశేషంగా సహస్రనామార్చన

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 1001 నామాలను పఠించి తులసితో అర్చన చేశారు. భక్తులకు ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు చెక్కు అందజేస్తున్న నితీష్ చంద్ర

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శనివారం నగరంలోని పాండురంగాపురానికి చెందిన కావూరి నితీష్ చంద్ర రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో సంబంధిత చెక్కును ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకు అందించారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందించారు.

అవార్డుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

పరవాడ: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు – 2025 కోసం అర్హత, ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని అనకాపల్లి జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావునాయుడు ఓ ప్రకటనలో కోరారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న అన్ని కేటగిరీల ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫెలో టీచర్ అవార్డు విభాగానికి ఐదుగురు ఉపాధ్యాయులు తమ ఆధారాలతో ఎలమంచిలి ఉప విద్యాశాఖ అధికారికి దరఖాస్తులను ఈ నెల 8 లోగా సమర్పించాలని సూచించారు.

పింగళి వెంకయ్య సేవలు మరువలేనివి



పింగళి వెంకయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పెందుర్తి : స్వాతంత్ర్య పోరాటంలో పింగళి వెంకయ్య దేశానికి అందించిన సేవలు మరువలేనివని పురుషోత్తపురం మండల పరిషత్ పాఠశాల హెచ్ఎం చిరికి శ్రీనివాసరావు అన్నారు. స్వాంతంత్ర్య సమరయోధుడు, జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య జయంతిని శనివారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పింగళి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రవేశాలపై అవగాహన

అగనంపూడి: విదేశీ విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు సులభంగా పొందడం, ప్రాముఖ్యత ఉన్న విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాలు, ఫీజుల వివరాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అమెరికా, కెనడాలోని పలు యూనివర్సిటీల్లో కోర్సులు, అర్హతలు, ప్రవేశాలు, ఫీజు వివరాలు, స్కాలర్‌షిప్‌లు తదితర అంశాలపై విద్యార్థులకు ఏఈసీసీ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు వివరించారు.

పారిశుధ్యం అధ్వానం

ఎక్కడికక్కడ పేరుకుపోయిన చెత్తకుప్పలు

ఏరోజుకారోజు తొలగించని కార్మికులు

పట్టించుకోని అధికారులు



వాడచీపురుపల్లిలో రంధ్రం పడిన చెత్త కుండీ



పరవాడలో తుప్పు పట్టిన డస్ట్ బిన్

పరవాడ : మండలంలోని గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోవడంతో **పారిశుధ్యం అధ్వానంగా** తయారైంది. కార్మికులు **ఏరోజుకారోజు చెత్త తొలగించకపోవడంతో**పాటు **పరవాడ, వాడచీపురుపల్లి** ప్రాంతాల్లో ఏర్పాటు చేసి**న డస్ట్‌బిన్లు తుప్పు పట్టి** పెద్ద పెద్ద రంధ్రాలు **కావడంతో వాటిలో వేసిన** చెత్తను కుక్కలు, పందు**లు బయటకు లాగి చెల్లా**చెదురు చేస్తున్నాయి. ఫ**లితంగా డస్ట్‌బిన్లు ఏర్పాటు** చేసిన ప్రదేశాలతోపాటు **రహదారులు అపరిశుభ్రం**గా మారడంతో వాహన**చోదకులు, పాదచారులు** ఇబ్బందులకు గురవుతు**న్నారు. గ్రామీణ ప్రాం**తాల్లో పారిశుధ్యం మెరు**గుపర్చే క్రమంలో ఎన్టీపీసీ** సింహాద్రి యాజమాన్యం **సీఎస్సార్ నిధులతో** కొన్నేళ్ల క్రితం ఈ రెండు **గ్రామాలకు డస్ట్‌బిన్లు మం**జూరు చేసింది. ఏళ్ల తరబ**డి వినియోగిస్తున్న డస్ట్‌బి**న్‌లలో తడి చెత్త, వ్యర్థా**లు వేయడంతో కుండీలు** తుప్పు పట్టి భారీ రంధ్రా**లు ఏర్పడ్డాయి. ప్రస్తుతం** గ్రామస్తులకు పాడైన **డస్ట్‌బిన్‌లే పెద్ద దిక్కుగా** మరాయి. చేసేది లేక ఇళ్లలో ఊడ్చిన చెత్తను ఆ పాడైన చెత్త కుండీల్లోనే పోస్తున్నారు. పందులు, కుక్కలు కారణంగా ఆ చెత్తంతా రోడ్లపైకి చేరుతోంది. పాడైన డస్ట్‌బిన్లను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాల్సిన గ్రామ పంచాయతీ అధికారులు కనీస చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్న అధికారులకు తుప్పు పట్టిన డస్ట్‌బిన్లు వల్ల అపరిశుభ్రంగా మారుతున్న ప్రదేశాలు, డస్ట్‌బిన్లు లేక ఆరుబయట కుప్పలుగా పోస్తున్న చెత్త కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో డస్ట్‌బిన్ లేక ఆరుబయట వేస్తున్న చెత్త



టిడ్కో కాలనీలో డస్ట్‌బిన్ లేక ఆరుబయట పోస్తున్న చెత్త

దుర్వాసన, దోమలతో అవస్థలు

మండల కేంద్రమైన పరవాడలో పలు చోట్ల ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా ఉన్నాయి. చెత్తను వాటిలో పోసినా... బయట పోసినా ఒక్కటేనని స్థానికులు అంటున్నారు. ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ తుప్పుపట్టి పెద్ద రంధ్రం పడడం వల్ల అందులో వేసిన చెత్తను కోళ్లు, కుక్కలు పాడు చేస్తున్నాయి. చెత్తంతా రోడ్డుపైకి రావడంతో వాహనచోదకులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. డస్ట్‌బిన్ నుంచి వస్తున్న దుర్వాసనతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదుల్లో ఉండలేక అవస్థలు పడుతున్నారు. మరోవైపు దోమలు కూడా పెరిగి స్వైరవిహారం చేస్తున్నాయని, రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు హడలిపోతున్నారు.

- **వాడచీపురుపల్లి** గ్రామంలో మెయిన్‌రోడ్డు, **గొల్లపేట రోడ్డులో ఏర్పాటు** చేసిన రెండు డస్ట్‌బిన్లు **తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డా**యి. డస్ట్‌బిన్‌లలో **వేసిన చెత్తను కుక్కలు చిందర**వందర చేస్తున్నాయి. **చెత్త కుండీల్లో ఉండాల్సిన చెత్త**ంతా రోడ్ల మీద చెల్లా**చెదురుగా పడుతోంది. డస్ట్‌బిన్**‌ల నుంచి పారిశుధ్య **సిబ్బంది ఎప్పటికప్పుడు చె**త్తను తొలగించకపోవ**డంతో దోమలు విజృంభిస్తు**న్నాయని స్థానికులు వాపోతున్నారు.
- గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని ఏళ్ల తరబడి వేడుకుంటున్నా పంచాయతీ అధికారులు కనీస చర్యలు తీసుకోలేదని స్థానిక నివాసులు వాపోతున్నారు. వీధుల్లో చెత్త కుండీలు లేక రోడ్ల మీద ఎక్కడిపడితే అక్కడ చెత్తను పోస్తుండడంతో పరిసరాలు మొత్తం అపరిశుభ్రంగా మారుతున్నాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడికలను తొలగించడం లేదని ఫలితంగా దోమలు పెరిగిపోయి విష జ్వరాల బారిన పడుతున్నామని కాలనీ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలి



టిడ్కో కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలని మొరపెట్టుకుంటున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. చెత్త కుండీలు లేక కాలనీ వాసులు ఎక్కడపడితే అక్కడ చెత్త పోస్తున్నారు. పోసిన చెత్తను కార్మికులు వెంటనే తొలగించకుండా వదిలేయడంతో దోమలు పెరిగి జ్వరాల బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నాం. కాలనీ వాసుల ఇబ్బందులను గుర్తించి కాలనీల్లో డస్ట్‌బిన్లు ఏర్పాటు చేయాలి.

– మన్యాల బంగారమ్మ, టిడ్కో కాలనీ

పాడైన డస్ట్ బిన్లు మార్చాలి



పరవాడలో పలుచోట్ల ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లు తుప్పు పట్టి పాడైపోయాయి. డస్ట్‌బిన్లలో వేసిన చెత్తను కుక్కలు, కోళ్లు, పందులు చిందరవందరగా చేసి రోడ్డుపైకి తీసుకొచ్చేస్తున్నాయి. చెత్త రోడ్ల మీదకు రావడంతో పాదచారులు, వాహనచోదకులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి పాడైన చెత్త కుండీలను తొలగించి కొత్తవాటిని ఏర్పాటు చేయాలి.

– పైల సత్యనారాయణ, పరవాడ

కొనుగోలు చేసే అధికారం లేదు



కొత్త డస్ట్‌బిన్లను కొనుగోలు చేసే అధికారం పంచాయతీలకు ప్రభుత్వం కల్పించలేదు. చాలా కాలం క్రితం సింహాద్రి ఎన్టీపీసీ మంజూరు చేసిన డస్ట్‌బిన్లనే వాడుతున్నాం. వాటిలో కొన్ని రంధ్రాలు పడి శిథిలావస్థకు చేరాయి. మళ్లీ కొత్తవి మంజూరు చేయాలని ఎన్టీపీసీ యాజమాన్యాన్ని కోరుతున్నాం. కాలనీల్లో డస్ట్‌బిన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం.

– వి.ధర్మారావు, ఈవోఆర్డీ, పరవాడ

---

150 మందికి నేత్ర వైద్య పరీక్షలు

పరవాడ : దాన్ ఫౌండేషన్, ఐద్వా మహిళ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గొర్లివానిపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరంలో జేఎన్ఎన్‌యూఆర్ఎం, టిడ్కో కాలనీలకు చెందిన 150 మంది రోగులకు వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 10 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కంటి చూపు మందగించిన పలువురికి కళ్లద్దాలు అందజేశారు. శిబిరంలో దాన్ ఫౌండేషన్ ప్రతినిధి సుహాసిని, అనకాపల్లి ఐద్వా మహిళా సంఘ అధ్యక్షురాలు పి.మాణిక్యం, మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, సీత, సరోజిని, వరలక్ష్మి, పద్మ, అప్పలరాజు, గోపాలరావు, రాజకుమారి పాల్గొన్నారు.



శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సమర్థవంతంగా విద్యాబోధన



శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీఈవో అప్పారావు నాయుడు

సబ్బవరం: శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను వినియోగించుకుని సమర్థవంతంగా విద్యాబోధన సాగించాలని ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు సూచించారు. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం నిర్వహించిన మొదటి విడత ఇన్ సర్వీస్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. తెలుగు బోధన సమయంలో విద్యార్థులను ఆకట్టుకునేలా పాటలు, కథలు మొదలైన ప్రక్రియ ద్వారా బోధన సాగాలన్నారు. విద్యార్థులతో మంచిగా వ్యవహరించాలని, లేకపోతే డ్రాపౌట్ అయ్యే ప్రమాదముందన్నారు. దానికి తానే ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. జీవితాలను మలుపు తిప్పే మంచి ఉపాధ్యాయులను విద్యార్థులు చిరకాలం గుర్తుంచుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఆర్.జయప్రకాష్, స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ శేషగిరి, సబ్బవరం ఎంఈవో జె.రవీంద్ర, ఏఎస్‌డీ జమున, ఏఎంవో కెజియా, ఆర్పీలు పాల్గొన్నారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



మహాలక్ష్మినగర్‌లో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది



సరిపల్లిలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో నీలవేణి

పెందుర్తి: తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్షని ఐసీడీఎస్ సీడీపీవో నీలవేణి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని సరిపల్లి, పెందుర్తి మహాలక్ష్మినగర్ ప్రాంతాల్లో శనివారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల పాటు పూర్తిగా తల్లిపాలు పట్టడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఆరు నెలల తరువాత తల్లిపాలతోపాటు సమాంతరంగా అనుబంధ ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మి, గీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలతో ఆరోగ్యం

పరవాడ : వాడచీపురుపల్లి శివారు పందివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. బిడ్డలకు తల్లి పాలను తాగించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. బిడ్డలకు పాలను పట్టించడంలో తల్లులు నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో పరవాడ మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, పంది రాజు, వియ్యపు ముత్యాలరావు, కర్రి సత్యవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హెచ్.వి.రమణి, ఏఎన్ఎం భారతి, శ్రావ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ శివలంక లక్ష్మి

వాటర్ ట్యాంకు అందజేత

పరవాడ: మండలంలోని వెన్నలపాలెం పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు మరమ్మతులకు గురవడంతో సిబ్బంది గత మూడేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఉప సర్పంచ్ వెన్నల సన్యాసిరావు చొరవ తీసుకుని సమస్యను గ్రామానికి చెందిన రిటైర్డు జీవీఎంసీ ఉద్యోగి వెన్నల అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సొంత నిధులతో పంచాయతీ కార్యాలయానికి కొత్త వాటర్ ట్యాంకును సమకూర్చి కార్యదర్శికి శనివారం అందజేశారు. పంచాయతీ కార్యాలయంలో మంచినీటి ఇబ్బందులను తీర్చడానికి సహకరించిన అప్పారావుకు సిబ్బంది ధన్యావాదాలు తెలిపారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు పైల సన్యాసిరావు, బోజంకి నాయుడు, పైల వరలక్ష్మి, మారునాయుడు, వీరు నాయుడు, రమణాజీ, శ్రీను, ప్రసాద్, సతీష్, సత్తిబాబు పాల్గొన్నారు.



వాటర్ ట్యాంకు వద్ద నాయకులు, సిబ్బంది

బాలుడికి అరుదైన రక్తం అందించి ప్రాణదానం

పెందుర్తి: పన్నెండేళ్ల బాలుడి కాలికి శస్త్రచికిత్స జరిగిన సమయంలో అవసరమైన అరుదైన గ్రూప్ రక్తాన్ని అందించి అరుణ్‌కుమార్ అనే వ్యక్తి రక్తదాతగా నిలిచారని పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీను తెలిపారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ నగరంలో గత శుక్రవారం స్కూల్ పిల్లల ఆటో బోల్తా పడి అందులో ఉన్న కర్రి మహేంద్ర(12) అనే బాలుడి కాళ్ల దగ్గర ఉండే ఆర్టరి నరం తెగిపోయిందన్నారు. బాలుడిని మెడికవర్ ఆస్పత్రిలో చేర్పించగా.. శస్త్రచికిత్స చేయాల్సి వచ్చిందని, ఆ సమయంలో ఓ పాజిటివ్ రక్తం అవసరమని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టును సంప్రదించారని చెప్పారు. దీంతో తెలిసిన రక్తనిధికి బాలుడి బంధువులను పంపగా.. అక్కడికి పట్టుకెళ్లిన రక్త నమూనా అక్కడున్న ఓపాజిటివ్ రక్తంతో సరిపోలేదన్నారు. క్షుణ్ణంగా పరిశీలించాక అది అత్యంత అరుదైన బొంబాయి బ్లడ్ గ్రూప్ అని నిర్ధారణ అయిందన్నారు. దీంతో అన్ని బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులను సంప్రదించామని, విశాఖలో ఒక్క సూర్యభాను ములగాడ అలియాస్ బొంబాయి సూర్య మాత్రమే బ్లడ్ అందిస్తారని వారు చెప్పారన్నారు. తాము బొంబాయి సూర్యని సంప్రదించగా.. హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గాజువాకకు చెందిన ప్రాసాదుల అరుణ్‌కుమార్‌ది బొంబాయి బ్లడ్ గ్రూప్ అని అతడి వివరాలు చెప్పారన్నారు. సూర్య ఫోన్ చేయడంతో వెంటనే స్పందించిన అరుణ్‌కుమార్ వచ్చి బాలుడికి రక్తదానం చేశారన్నారు. అరుణ్‌కుమార్‌కు ఇటీవలే వివాహం జరిగిందని, ఇప్పటికి 15 సార్లు రక్తదానం చేశారని, చెన్నై కూడా వెళ్లి కూడా రక్తదానం చేయడం విశేషమన్నారు. ఆయన స్ఫూర్తి అందరికీ ఆదర్శం కావాలని ఈ సందర్భంగా దాడి శ్రీను అభినందించారు.

హయ్యర్ పెన్షన్ అమలు చేయాల్సిందే..



ధర్నాలో ప్రసంగిస్తున్న జీటీపీ ప్రకాష్

గాజువాక: సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం భెల్ కార్మికులకు హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంస్థ ప్రొగ్రెసివ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో భెల్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి ఇతర పరిశ్రమలకు సంబంధించిన పలు సంఘాలు మద్దతు తెలిపాయి. ఈ సందర్భంగా భెల్ సీఐటీయూ నాయకుడు జి.టి.పి.ప్రకాష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం ఈపీఎఫ్–95 హయ్యర్ పెన్షన్‌ను ఇతర యూనిట్లలో అమలు చేస్తున్నారన్నారు. ఇక్కడ యాజమాన్యం, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తాత్సారం చేస్తున్నాయన్నారు. వివిధ సీరీస్‌లకు చెందిన కార్మికుల జాయింగ్ తేదీలను సరి చేసి హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పీఎఫ్ ట్రస్టు కూడా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐఎన్‌టీయూసీ నాయకుడు సీతన్న నాయుడు మాట్లాడుతూ కార్మికులను కంపెనీ యాజమాన్యం, ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ నాయకుడు ఎన్.రామారావు మాట్లాడుతూ ఐక్య ఉద్యమాల ద్వారా హయ్యర్ పెన్షన్ సాధించామన్నారు. ఇక్కడ హయ్యర్ పెన్షన్‌ను అమలు చేయకపోవడం కార్మిక వ్యతిరేక చర్య అన్నారు. నాయకులు ఎస్.ప్రసాద్, దీనబంధు, ఎస్.జగన్నాథరావు, అల్లం వెంకటేశ్వరరావు, ఎస్.అప్పలరాజు, యుఎంకే ఆచారి, ఎస్.సహబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను తిరస్కరించండి

- వామపక్ష నాయకుల పిలుపు

పెందుర్తి: గత ప్రభుత్వంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తామంటే తరమికొట్టండని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్.. ఇప్పుడు అదానీ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడానికి సిద్ధం కావడం సిగ్గుచేటని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, ఏఐటీయూసీ నేత ఆర్.శ్రీనివాస్, సీపీఎం గోపాల పట్నం జోన్ కమిటీ కార్యదర్శి, సీఐటీయూ నేత బి.జగన్ విమర్శించారు. ప్రజలంతా కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధమైన స్మార్ట్ మీటర్లను తిరస్కరించాలని పిలుపునిచ్చారు. 'అదానీ స్మార్ట్ మీటర్లు వద్దు–పెంచిన విద్యుత్ చార్జీల రద్దు' అనే నినాదంతో స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఏపీఈపీడీసీఎల్ సబ్ స్టేషన్ వరకు శనివారం పాదయాత్ర నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రస్తుతం తాము వినియోగించిన విద్యుత్‌కు మాత్రమే బిల్లులు కడుతున్నారని.. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తీవ్ర భారమవుతుందన్నారు. ఒక్కో మీటర్‌కు కేటగిరీలను బట్టి రూ.8,927, రూ.17,286 వసూలు చేయాలని నిర్ణయించడం దారుణమన్నారు. గతంలో బిల్లుల చెల్లింపునకు కనీసం 15 రోజుల గడువు ఉండేదని, ఇప్పుడు స్మార్ట్ మీటర్ల పుణ్యమా అని ముందుగానే విద్యుత్‌కు రీచార్జ్ చేసుకునే దుస్థితి వస్తుందన్నారు. పొరపాటున రీచార్జ్ చేసుకోకపోతే ప్రజలు చీకట్లో బతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాన్ని ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వామపక్షాలు, ప్రజా సంఘాల నాయకులు బి.రమణి, కె.అప్పలనాయుడు, ఈశ్వరరావు, తిరుపతిరావు, అన్నపూర్ణ, మహాలక్ష్మి, లక్ష్మి, ముత్యాలమ్మ, అప్పారావు, సూర్యప్రకాషరావు, రాంబాబు, ప్రభుదేవా తదితరులు పాల్గొన్నారు.



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న వామపక్షాలు, కార్మిక సంఘాల నాయకులు



స్మార్ట్ మీటర్లపై నిరసన తెలుపుతున్న వినియోగదారులు, సీఐటీయూ కార్యకర్తలు

స్మార్ట్ మీటర్లు వెంటనే తొలగించాలి

పరవాడ: విద్యుత్ వినియోగదారులకు నష్టం కలిగించే స్మార్ట్ మీటర్లను గృహాలకు అమర్చవద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమా హాలు కూడలిలో శనివారం స్మార్ట్ మీటర్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ గతంలో బిగించిన స్మార్ట్ మీటర్ల వల్ల అధిక విద్యుత్ బిల్లులు రావడంతో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటి వరకు ఇళ్లకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని కూటమి నాయకులు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీలను రద్దు చేయాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గొరుపూటి శ్రీను, వాసిరెడ్డి బాపునాయుడు, జెర్రిపోతుల నూకప్పారావు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' చెక్కు పంపిణీ



సబ్బవరంలో రైతులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

సబ్బవరం: మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా పెందుర్తి నియోజకవర్గంలోని 18,590 మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. వీరిలో సబ్బవరం మండలం నుంచి 10,598 మంది, పరవాడ మండలం నుంచి 4,860 మంది, పెందుర్తి నుంచి 3,126 మంది రైతులు ఉన్నారన్నారు. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వ వాటాగా రూ.2 వేలు కలిపి రూ.7 వేలు రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె.రమామణి, ఇన్‌చార్జి ఎంపీడీవో శివరామ ప్రసాద్ నారాయణరావు, తహసీల్దార్ బి.చిన్నికృష్ణ, వ్యవసాయ అధికారి పి.సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దాడి ఝాన్సీ లక్ష్మీరాణి, ఇందల వెంకటరమణ, బైలిపూడి దేముడు తదితరులు పాల్గొన్నారు.